క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



మహిళకు ప్రసవం చేసిన ఈఎంటీ

ములుగు రూరల్: 108లో మహిళ ప్రసవించిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సంగీత భర్త దేవరిలాలుతో కలిసి జంగాపల్లి వద్ద కూలీపనులు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. సంగీత గర్భిణి కాగా అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో భర్త 108కు సమాచారం అందించగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు శిషువుకు నెలలు నిండలేదని, సంగీత ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. ఎంజీఎంకు తరలిస్తున్న క్రమంలో ఆత్మకూర్ వద్దకు చేరుకోగానే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో డ్రైవర్ రమేశ్ రోడ్డు పక్కన వాహనం నిలిపగా ఈఎంటీ కుమార్ డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఎంజీఎంలో అడ్మిట్ చేసినట్లు తెలిపారు.

ఏటూరునాగారంలో..



ఏటూరునాగారం : మండలంలోని గొత్తికోయగూడెం గంటలకుంటకు చెందిన ఆవులం సునీతకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. కాగా వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో డెలివరీ అయింది. అంబులెన్స్ పైలేట్ కోటి, ఈఎంటీ శివలింగప్రసాద్ చాకచక్యంగా డెలివరీ చేయడంతో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. వారిని సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

నూతన కమిటీల ఎన్నిక

వాజేడు: మండలంలోని వాజేడు, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆశకార్యకర్తల నూతన కమిటీలను ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రఘుపతిరావు సమక్షంలో వేర్వేరుగా ఎన్నుకున్నారు. వాజేడు ఆశవర్కర్ల యూనియన్ కార్యదర్శిగా కంతి సరిత, అధ్యక్షురాలిగా నల్లబోయిన దేవి, కమిటీ సభ్యులుగా ఎట్టి శివకుమారి, బోదెబోయిన అరుణ, అట్టం సునీత, ముప్పురి మానస, అల్లి జ్యోతి ఎంపికయ్యారు. పేరూరు యూనియన్ కార్యదర్శిగా పూనెం కుమారి, అధ్యక్షులురాలిగా బోగ వెంకట రమణ, కమిటీ సభ్యులుగా దుబ్బ దేవమ్మ, సత్యవతి, చింత వసంత లక్ష్మి, యాలం సుగుణ, ఇర్ప సుశీల ఎంపికయ్యారు.

సీఐ రంజిత్‌రావుకు రజత పతకం



హార్ట్‌లైనర్ ట్రోఫీ, రజత పతకాన్ని అందుకుంటున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : వరంగల్‌లో జరిగిన 2వ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో శాయంపేట సీఐ రంజిత్ రావు హార్ట్ లైనర్ ట్రోఫీతో పాటు రజత పతకాన్ని సాధించారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీలు జితేందర్, సౌమ్యమిశ్రా, ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీపీ సన్‌ప్రీత్, డీసీపీ అంకిత్ చేతుల మీదుగా హార్ట్ లైనర్ ట్రోఫీతో పాటు రజత పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐని శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

- దోమల నివారణకు ప్రత్యేక చర్యలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

మొగుళ్లపల్లి: వానాకాలం అపరిశుభ్రత కారణంగా గ్రామాల్లో దోమలు, ఈగలు విజృంభిస్తాయి. దీంతో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రోగాలతో మంచం పడుతుంటారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో దోమలు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలుపుతున్నారు. డ్రమ్ములు ఇతర వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నారు. నీటి గుంతల్లో అయిల్ బాల్ చల్లడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు బ్లీచింగ్ చల్లుతున్నారు..

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమ తెరలు వాడాలి.
- వేడి ఆహారం తీసుకోవాలి.
- ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం..



చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాకాలంలో కాచిచల్లార్చిన నీటిని తాగాలి. జర్వం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

- నాగరాణి, మండల వైద్యాధికారిణి

పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం..

మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేశాం. మంచి నీటి బావుల్లో, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశాం. పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాం.

- రామకృష్ణ, ఎంపీఓ

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఏటూరునాగారం: బస్టాండ్ వద్ద..



మంగపేట: బోరునర్సాపురంలో..

ఏటూరునాగారం/మంగపేట: మండలాల్లోని విద్యార్థులు, యువకులు, మహిళలు, బాలికలు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్‌బాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.



ఏటూరునాగారం: రామాలయం వద్ద స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బాండ్‌లను కట్టుకుంటున్న విద్యార్థులు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న డీసీఎం సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న డీసీఎం

ఏటూరునాగారం: ఇన్నాళ్లు లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను తరలించుకపోయేది. ఇప్పుడు ఏకంగా డీసీఎంలోనే ఇసుక రవాణాను కొనసాగించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మండలంలోని పోలీసులు ఏటూరునాగారం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతుల లేని డీసీఎంలో ఇసుకను తరలిస్తుండగా ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కొంత మంది కూలీలను డీసీఎంలో ఎక్కించుకొని ఏటూరునాగారం జంపన్నవాగులో నుంచి రాత్రికి రాత్రే లోడ్ చేసుకొని వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎంను పోలీసులు పట్టుకున్నారు. వాహన డ్రైవర్ జహీర్ ఏటూరునాగారం అతని బంధువు అయిన సద్దాంహుస్సేతో కలిసి హనుమకొండకు తరలించి కొంత కాలంగా లాభాలను గడిస్తున్నాడు. ఈ వాహనాన్ని వే బ్రిడ్జి ద్వారా తూకం వేసి డీసీఎంలో 14 టన్నుల ఇసుక ఉందని ఎస్సై తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి డీసీఎంను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పీ ఎస్సై నరేష్, అన్వేష్ కార్తీక్, కానిస్టేబుళ్లు అజయ్, విక్రమ్, హరీశ్, ధ్రువ, గోపి పాల్గొన్నారు.

సున్నం రాజయ్యకు ఘన నివాళి



వెంకటాపురం(కె): నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహచారి, ప్రసాద్, మాణిఖ్యం , రాజేష్, రమణయ్య తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశవర్కర్లపై పనిభారం తగ్గించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



మాట్లాడుతున్న రత్నం రాజేందర్

వాజేడు: ఆశవర్కర్లపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. మండల పరిధిలోని పూసూరుగు గ్రామంలో ఆదివారం వాజేడు, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పని చేస్తున్న ఆశకార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ కార్యకర్తలతో రోజుకు 12 నుంచి 15 గంటల పని చేయిస్తున్నట్లు ఆరోపించారు. రిపోర్టుల పేరుతో వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. వారికి కనీస వేతనాలను ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రఘుపతిరావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

శాయంపేట : రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి అధిక లాభాలను పొందాలని ఏఓ గంగాజమున ఆదివారం తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్క ప్రైవేట్‌గా తీసుకుంటే రూ.190 ఉంటుందని, ప్రభుత్వం రూ.20 అందిస్తుందన్నారు. ఎకరానికి కేవలం రూ.1200 మాత్రమే పెట్టుబడి అవుతుందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ పంట వేసిన 3 సంవత్సరాల వరకు రైతులు అంతర పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడితో రైతులకు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: బ్యాగులు సోదాలు చేస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె)లో..



ములుగు రూరల్: జగ్గన్నపేటలో..

వాజేడు: మండల పరిధిలోని కడేకల్ వద్ద జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలను నిర్వహించారు. మావోయిస్టులు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలని బోదాపురం గ్రామ శివారులో ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్సై తిరుపతిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని 163 జాతీయ రహదారిపై ఏటూరునాగారం ప్రొబెషనరీ ఎస్సై నరేష్ ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదానికి గురికావద్దని ముందస్తు చర్యల్లో భాగంగా బ్రీత్‌ఎనలైజర్‌తో తనిఖీలు చేపట్టి జరిమానాలను విధించారు. ఆహ్లాదం కోసం వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు తెలిపారు.

ములుగు రూరల్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండల పరిధిలోని జగ్గన్నపేట శివారులో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సై మహేశ్, సివిల్, టీజీఎస్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

'మోసంచేస్తున్న కాంగ్రెస్'



సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రజలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరిస్తూ మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కన్నం యుగదీశ్వర్, జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆదివారం జిల్లాకేంద్రంలోని మెయిన్ రోడ్, సుభాష్ కాలనీలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత హామీలకు నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు గీసా సంపత్, శివరాత్రి వేణు, కంచం నరసింహమూర్తి, తాండ్ర హరీశ్, ఆవుల సంతోష్, తోటల స్వామి, సిలువేరి కార్తీక్, పాసికంటి రాజేందర్, తాళ్ల ప్రవీణ్, రవి, రాజయ్య పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ములుగు రూరల్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఇంటింటికీ బీజేపీ–మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య జవహర్‌లాల్, రవీంద్రాచారి, నగరపు రమేశ్, విశ్వనాథ్, రాజ్‌కుమార్, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

- పస్రా ఎస్సై కమలాకర్



మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యాపారస్తులు, ఫర్టిలైజర్ యాజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోగా పరిశీలించి మాట్లాడారు. సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందన్నారు. వ్యాపారస్తులు అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, బాలాజీ, రమణ, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



బొలెరో వాహనంలో తరలిస్తున్న పశువులు

ములుగు రూరల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు బస్టాండ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా బొలెరో వాహనంలో 5 ఆవులు, 3 ఎద్దులు, గేదె బంధించి ఉంది. దీంతో పశువులు అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి తరలిస్తున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోశాలకు తరలించారు.

గుంతలు, రాళ్లతో ఉన్న కల్వర్టు



ప్రమాదకరంగా కల్వర్టు

చిట్యాల: మండలంలోని శాంతినగర్ శివారులోని కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు అదుపు తప్పితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కల్వర్టు నిర్మాణానికి గతంలోనే శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లపైనే మూగజీవాలు



ఏటూరు వద్ద రోడ్డుపై ఉన్న పశువులు



బుట్టాయిగూడెం వద్ద ప్రధాన రోడ్డుపై ఉన్న పశువులు

- రాత్రి సమయంలో రహదారులపై పశువులు, గేదెలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కన్నాయిగూడెం : పశువులను, గేదెలను ఇంటివద్ద కట్టేయకుండా రాత్రి సమయంలో రోడ్లపై వదులుతున్నారు. దీంతో రాత్రి వేళలో ప్రధాన రోడ్లపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం తుపాకులగూడెం, ఏటూరునాగారం మండలాలకు రాత్రి పగలు తేడా లేకుండా వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. పశువులు, గేదెలు మండలంలోని ఏటూరు నుంచి తుపాకులగూడెం వరకు ప్రధాన రోడ్డుతో పాటు గ్రామాల్లోని రోడ్లపై వందల కొద్దీ పశువులు రోడ్లపై ఉంటాయి. దీంతో వాహనదారులకు రాత్రి వేళలో లైట్ వేసుకొని వచ్చినా కానీ దగ్గరకు వచ్చే వరకు లైట్‌లో కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ఎంతో మంది రోడ్లపై ఉన్న మూగజీవులతో ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. కానీ వాటిని పాబందీ చేయాల్సిన పంచాయతీ, మండల అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదు. వాటిని కాపాడుకోవాల్సిన రైతులు కూడా ఇంటి వద్ద కట్టేసుకోవడం లేదు. వీటితో వాటికి ఆకలిగా ఉన్న సమయంలో అందుబాటులో ఉన్న పంటపొలాలకు వెళ్లి పొలాలను కూడా పాడు చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, రైతులు చొరవ తీసుకొని పాశువులను రోడ్లపైకి రాకుండా చూడాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంటి ఆవరణలో కట్టేసుకోవాలి



మండలంలోని రైతులు వారి పశువులను ఇంటి వద్ద కట్టేసుకోవాలి. రోడ్లపై వదలడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలి.

–దుర్గం రాజేశ్, కన్నాయిగూడెం

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. ములుగు ఎస్సై వెంకటేశ్వరావు కుమారుడు చవల మహేందర్‌శ్రీయాన్, కూతురు మోక్షశ్రీ ములుగులోని బిట్స్ స్కూల్‌లో 5, 3వ తరగతి చదువుతున్నారు. కాగా, ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన సౌత్ ఇండియన్ ఎఫ్ఎస్‌కేఓ కరాటే పోటీల్లో ఛాంపియన్ షిప్ గోల్డ్ మెడల్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, జిల్లా వాసులు అభినందించారు.